# ఈ నెలాఖరులోగా ఉపాధి హామీ పథక నిధులతో చేపట్టిన పనులను పూర్తి చేయాలి : కలెక్టర్ సన్మోహన్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులను పురోగతిపై శుక్రవారం రాష్ట్ర రాజధాని అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖల మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్.. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్, డైరెక్టర్ కృష్ణ తేజ, ఆర్డబ్ల్యూఎస్ ఇతర ఉన్నత స్థాయి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ షణ్మోహన్,సంబంధిత శాఖ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ నెల 22న ప్రపంచ జల దినోత్సవం కార్యక్రమం నిర్వాహణ, పల్లె పండుగ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు, మినీ గోకులాలు, ఫారంఫండ్స్ ఇతర పనుల ప్రగతిని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,జిల్లాల కలెక్టర్లతో చర్చించారు. నిర్దేశించిన లక్ష్యంలోపు పనులు పూర్తి చేయడంతో పాటు భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై జిల్లా అధికారులకు ఆయన దిశా నిర్దేశనం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఈ నెల 22 శనివారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామం పంచాయతీ పరిధిలో ఫారంఫండ్స్ పనుల గ్రౌండింగ్ చేయాలన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులను తప్పనిసరిగా ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 196 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మాణానికి గాను 138 కిలోమీటర్లలో సీసీ రోడ్లు నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. 804 మినీ గోకులను నిర్మించామని, 2500 ఫారంఫండ్స్ కు గాను 823 గ్రౌండింగ్ పూర్తి చేయడం జరిగిందన్నారు.

# ప్రగతి లో "టోస్ట్మాస్టర్స్ ఇంటర్నేషనల్ ఏరియా ఐ-1" కాంటెస్ట్



**గండేపల్లి , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**

గండేపల్లి మండలం సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో "టోస్ట్ మాస్టర్స్ ఇంటర్ నేషనల్ ఏరియా ఐ-1" కాంటెస్ట్ లో ఇంటర్నేషనల్ స్పీచ్ కాంటెస్ట్, టేబుల్ టాపిక్ కాంటెస్ట్ లు నిర్వహించారని ఈ కార్యక్రమానికి టోస్ట్మస్టర్స్ పి.సాయి చరణ్ సింగ్,ఎన్. దత్త సాయిరాం,కె.ఎల్.ఎల్. అమృత,సాయి కృష్ణ కొంత మంది ప్రముఖులు విచ్చేసారని కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోస్ట్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ కాంటెస్ట్లో పాల్గొని విజేతలైన విద్యార్థులు డివిజనల్ లెవెల్కి అర్హత సాధిస్తారని, వీటిలో పాల్గొనడానికి తమ సమీప కళాశాలలైన ఎస్.ఆర్.కె.ఆర్., శ్రీ విష్ణు ఇంజనీరింగ్ కాలేజి, కైట్ కాలేజీల నుండి విద్యార్థులు విచ్చేసారన్నారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులు స్పీకింగ్ స్కిల్స్ ను మెరుగుపరుచుకుంటూఆత్మ విశ్వాసంతో విజయాలు సాధించవచ్చునని పేర్కొన్నారు.ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ గా ఎం.మాధవి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్ మేనేజ్మెంట్ ఎం. వి. హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎమ్. సతీష్ ,డైరక్టర్-అకడమిక్స్ డాక్టర్ కె.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

# కెజిబివిలో 6వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ధరఖాస్తుల స్వీకరణ : ప్రత్యేక అధికారి బి బాల మణికుమారి

**శంఖవరం , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ (కెజిబివి)లో 2025 - 26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా ఆహ్వానిస్తున్నట్లు కెజిబివి ప్రిన్సిపాల్ బి బాల మణికుమారి తెలిపారు. కెజిబివిలో 6వ తరగతిలో 40 సీట్లు, మొదటి ఇంటర్మీడియట్ ఎంపిసిలో 40 సీట్లు ఉన్నట్లు మణికుమారి తెలిపారు. ఇప్పటికే వివిధ కెజిబివిల్లో పదవ తరగతి చదువుతున్న బాలికలు కూడా 11వ తరగతిలోకి దరఖాస్తులు చేసుకోవాలని ఆమె వెల్లడించారు. ఈ నెల 22 తేదీ నుంచి ఏప్రిల్ 11 వరకు తేదీ ఏపీ కెజిబివి వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఈ అవకాశం కేవలం అనాధ పిల్లలు, బడి బయట పిల్లలు, బడి మానివేసిన (డ్రాపౌట్స్) విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ,



బిసి, మైనార్టీ సామాజిక వర్గాల్లోని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లోని అల్పాదాయ వర్గాల బాలికలు మాత్రమే అర్హులని ఆమె స్పష్టం చేశారు. అంతర్జాలంలో కెజిబివి వెబ్సైట్ లో ఏప్రిల్ 11తేదీ నాటికి ధరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. అంతర్జాల ఆధారిత దరఖాస్తులను మాత్రమే ప్రవేశ అర్హతల పరిశీలన కోసం స్వీకరిస్తామని ఆమె స్పష్టం చేశారు. ప్రవేశాలకు ఎంపికైన అర్హులైన విద్యార్థినులకు ఫోన్ ద్వారా సమాచారం పంపుతామని, అలాగే ఎంపికైన అభ్యర్థుల వివరాల జాబితాలను తమ కెజిబివి నోటీస్ బోర్డులో అందరికీ అందుబాటులో ఉంచుతామని, దరఖాస్తు చేసుకున్న వారందరూ నేరుగా పరిశీలించుకోవచ్చని ఆమె వివరించారు. కేవలం తమ కెజిబివిలో ప్రవేశాలు కోరేవారు, దరఖాస్తు చేసేవారు మాత్రమే పూర్తి వివరాలను తెలుసుకునేందుకు శంఖవరంలో గల కెజిబివి పనిదినాల్లో మాత్రమే సంప్రదించగలరు. అలా సంప్రదించే అవకాశం లేనివారు దరఖాస్తు చేయడంలోని వారి సమస్యలు, సందేహాల నివృత్తి కోసం తమ కార్యాలయం 96181 46624 ఫోన్ నంబరులో సంప్రదించ వచ్చని ప్రిన్సిపాల్ బాలమణికుమారి సూచించారు.

# మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే ఫిర్యాదు చేయాలి : సిఐ భీమరాజు

**అంబాజీపేట , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**



మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే పి.గన్నవరం సర్కిల్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్లో తక్షణమే ఫిర్యాదు చేయాలని పి.గన్నవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్.భీమరాజు సూచించారు.

సర్కిల్ పరిధిలో గత మూడు రోజుల క్రితం మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న ఐదుగురు బాధితులకు అంబాజీపేటలో సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో రికవరీ చేసుకున్న మొబైల్ ఫోన్లను శుక్రవారం అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.చిరంజీవి ఉన్నారు.

# ఆలయ అభివృద్ధికి ఆర్థిక సహాయం



**పిఠాపురం , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**

పిఠాపురం పట్టణంలోని స్థానిక ఏడు కాలువల గ్రామంలో నూతనంగా పునః ప్రతిష్ట చేసిన, శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయానికి, శ్రీరామ హిందూ ఆధ్యాత్మిక సమాజ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రొద్దుటూరుకి చెందిన భక్తులు సాయి తేజస్వి, కుటుంబ సభ్యుల సహకారంతో ఆలయ అభివృద్ధి నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయం శుక్రవారం అంద జేశారు.ఆలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో భాగంగా, పిఠాపురం వేణుగోపాలస్వామి అర్చకుడు విజయ జనార్ధనా చార్యులు, సేవా సంఘం సభ్యులు చేతుల మీదుగా, ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.ఆలయ గర్భగుడిలో టైల్స్ వేయుటకు గాను రూ.18 వేల అంచనాతో పనులు ప్రారంభించగా, ముందుగా ఈ ఆర్థిక సహకారాన్ని అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ఉపాధ్యక్షుడు అప్పలరాజు బాబు, సభ్యులు సుబ్రహ్మణ్యం, సలహాదారుడు వీరబాబు శ్రీనివాసు,రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత చలివేంద్రం అభినందనీయం : ఎం.హెచ్.వో వినూత్న



**రాజమహేంద్రవరం,మార్చి 21 ( ప్రభాతవార్త )**

వేసవి సీజన్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్లాస్టిక్ రహిత చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని రాజమండ్రి నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ వినూత్న అన్నారు.స్థానిక 22.23 వార్డులో 13వ క్లస్టర్ శానిటరీ సిబ్బంది నిర్వహిస్తున్న చలివేంద్రంలో శుక్రవారం ఎం.హెచ్.ఓ.డాక్టర్ వినూత్న మజ్జిగ పంపిణీ చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ వేసవిలో ఇప్పటికే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ఇలాంటి సమయంలో నగరపాలక సంస్థ శానిటరీ అధికారులు ,ఉద్యోగులు, సిబ్బంది చలివేంద్రం ఏర్పాటు చేయడం గొప్పవిషయమని కొనియాడారు.ప్రతిరోజు మజ్జిగ పంపిణీ జరుగుతుందని, సాయంత్రం కూడా చల్లని తాగునీరు అందచేస్తారని డాక్టర్ వినూత్న చెప్పారు. ఈ చలివేంద్రంలో ప్లాస్టిక్ గ్లాసులు ఉండవని తెలిపారు.

నగరంలో అనేక చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారని ,ప్లాస్టిక్ రహితంగా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తే పర్యావరణాన్ని పరిరక్షించినట్లవుతుందని డాక్టర్ వినూత్న సూచించారు. ఈకార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్స్ శ్రీనివాస్, కె. రామలింగారెడ్డి, సుధీర్. ప్రసాద్ సిద్ధాంతి,మండవల్లి విష్ణు, యు.మంగరాజు, శానిటరీ సిబ్బంది ఏ దుర్గాప్రసాద్, జి వెంకట రమణ, పి రాజకుమార్, సిహెచ్. కిరణ్ బాబు, ధన అప్పారావు, సత్యనారాయణ, డి శంకర్, ఆర్ రమణ, కె కామరాజు, ఎన్ ప్రసాద్, నాగలక్ష్మి, బి బృందావని,అనుశ్రీ, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# మూడవ శుక్రవారం రంజాన్ ప్రత్యేక నమాజులు



**మామిడికుదురు , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**

రంజాన్ మూడవ శుక్రవారం ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో నమాజులు(ప్రార్థనలు)చేశారు. మామిడికుదురు నస్రుమ్ మినల్లా షియ్యా మసీదులో మత ప్రబోధకులు షబ్బర్ అలీ జైదీ,సున్నీ జామియా మసీదులో సాదిక్ అన్వర్ రజ్వి లు ప్రత్యేక నమాజులు చేయించారు.తొలుత రంజాన్ మాసంలో శుక్రవారం నాడు చేసే ప్రార్థనల యొక్క విశిష్టతను భక్తులకు వివరించారు. రంజాన్ మాసం అతి పవిత్రమైన దని దీనిలో పేదలకు దానధర్మాలు చేస్తే అత్యంత పుణ్యం లభిస్తుం దన్నారు.తెలిసీ తెలియక చేసిన పాపాలు తొలగి పోతాయన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# జీవ నియంత్రణా ప్రయోగాలు రైతులకెంతో ఉపయోగం : డాక్టర్ బి.ఎ.జెరార్డ్

**అంబాజీపేట , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**



కొబ్బరి,ఉద్యాన పంటలలో జీవనియంత్రణా విధానంలో సస్య రక్షణా చర్యలు చేపట్టడం వలన క్రిమిసంహారక రహిత దిగుబడులు లభిస్తాయని,మానవ ఆరోగ్యానికి ఎంతో ఉపయోగమని అఖిల భారత వన్యతోటల సమన్వయ పథకం కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.ఎ.జెరార్డ్ అన్నారు. అంబాజీపేట వై.యస్.ఆర్.ఉద్యాన పరిశోధనా స్థానాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా డాక్టర్ జెరార్డ్ మాట్లాడుతూ కొబ్బరి,ఉద్యాన పంటలను ఆశించే తెగుళ్ళ,పురుగులను సమర్ధవంతంగా నియంత్రించేందుకు చేపడుతున్న జీవనియంత్రణ ప్రయోగాలు రైతులకెంతో ఉపయో గపడు తున్నాయన్నారు.అనంతరం పరిశోధనా కేంద్రంలో రావేప్(గ్రామీణ ఉద్యాన పని అనుభవం కార్యక్రమం) విద్యార్థులతో మమేకమై కొబ్బరిలో జరిగిన, జరుగుతున్న పరిశోధనా ఫలితాలు,ప్రగతి విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి దిశా,నిర్దేశం చేస్తాయన్నారు.అనంతరం పి.గన్నవరం మండలం ముంజవరంలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసిన క్షేత్రస్థాయి సమావేశములో పాల్గొని రైతులకు ఎరువులను పంపిణీ చేశారు.స్థానిక పరిశోధనా కేంద్రంలో క్షేత్ర స్థాయి సందర్శన చేసి సాంకేతిక సమీక్షా సమావేశాన్ని నిర్వహించి పరిశోధనా ప్రగతిపై శాస్త్రవేత్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పరిశోధనా కేంద్ర అధిపతి డాక్టర్ ఎస్.బి.వి.చలపతిరావు,శాస్త్రవేత్తలు డాక్టర్ కె.మమత, డాక్టర్ వి.గోవర్ధనరావు,డాక్టర్ బి.నీరజ,డాక్టర్ అనూష, ఎ.కిరీటి,కొబ్బరి అభివృద్ధి బోర్డు విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కుమార్ వేల్,ఉద్యాన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మెడికల్ షాపు లపై ఆపరేషన్ గరుడ దాడులు

**అమలాపురం , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**

అమలాపురంలో పలు మెడికల్ షాపులపై ఆపరేషన్ గరుడ అధికారులు దాడులు నిర్వహించారు .ఈ ఆకస్మిక దాడులలో వివిధ డిపార్ట్మెంట్ లకు చెందిన అధికారుల తనిఖీ లు నిర్వహించి షాపుల యజమాను ల నుండి పలు అంశాలపై విచారణ చేశారు.ఆపరేషన్ గరుడా పేరుతో జరిగిన ఈ దాడులలో నిషేధిత మత్తుమందులు,కల్తీ మందులకు సంబంధించి ఈ ఆపరేషన్ జరుగుతున్నట్లు ఎన్ఫోర్స్మెంట్ రాజమండ్రి ఇన్స్పెక్టర్ మధుబాబు తెలిపారు.రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్త ఆదేశాలతో చేపట్టిన ఈ దాడులు ఎన్ఫోర్స్మెంట్ జిల్లా ఎస్పీ స్నేహిత ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నాలుగు బృందాలుగా ఈ దాడులు నిర్వహిస్తున్నట్లు ఇన్స్పెక్టర్ మధు బాబు వెల్లడించారు. నిషేధిత మత్తు కలిగించే మందులు అమ్మకాలపై వచ్చిన సమాచార మేరకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధానంగా యువత ఆకర్షణకు బానిసవుతున్న ఈ మత్తు ఇంజక్షన్లు,టాబ్లెట్లు



నిషేధిత మైనా కొందరు వ్యాపారులు యధేచ్ఛగా వీటిని అమ్మకాలు సాగిస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.మండల కేంద్రాలు, పట్టణ కేంద్రాల్లో ఈ టీములు ర్యాండమ్ గా తీసుకుని ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.అమలాపురం పట్టణంలో నాలుగు ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేశారు.విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్మెంట్,డ్రగ్స్ నియంత్రణ,లా అండ్ ఆర్డర్ పోలీస్ అధికారులు సంయుక్తంగా ఈతనిఖీలు చేపట్టగా విషయం తెలిసిన వెంటనే పలు మెడికల్ షాపులను మూసివేశారు.

# పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



**రౌతులపూడి , మార్చి 21 ( ప్రభాతవార్త )**

రౌతులపూడిలో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి శుక్రవారం ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సూర్య అప్పారావు, ఎస్సై జి. వెంకటేశ్వరరావు, తాసిల్దార్ ఎస్వీ నరేష్ స్థల పరిశీలనచేశారు. ఎంఈఓ కార్యాలయం ప్రక్కనున్న పాత వెలుగు కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సి. ఐ. తెలిపారు.

# విద్య విజ్ఞాన విహారయాత్రలు విద్యార్థులకు ఎంతో దోహదం



**కోనసీమ బ్యూరో , మార్చి 21 ( ప్రభాతవార్త )**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల విద్యా విజ్ఞాన అధ్యయన విహార యాత్ర బస్సులను స్థానిక కలెక్టరేట్ నందు శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి బి ఎల్ ఎన్ రాజకుమారి జెండా ఊపి విజ్ఞాన యాత్రను ప్రారంభిం చారు. ఈ విహారయాత్ర ఈనెల 21 నుండి 23వ తేదీ వరకు 131 మంది 8 ,9 తరగ తుల విద్యార్థులు, 20 మంది ఉపాధ్యాయులతో బయలు దేరిందన్నారు.విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించేందుకు ఈ విజ్ఞాన అధ్యయన యాత్రను రూపొం దించారన్నారు. ఈ యాత్రలో భాగంగా విద్యార్థులు తిరు పతి లోని ఐఐటీ తిరుపతి, రీజినల్ సైన్స్ సెంటర్, తిరు పతి జూలాజికల్ గార్డెన్, చంద్రగిరి కోట వంటి ప్రముఖ విద్యా, శాస్త్ర, సాంస్కృతిక ప్రదేశాలను సందర్శించ నున్నారన్నారు. అనంతరం జిల్లాలోని కోరింగ అభయా రణ్యాన్ని పరిశీ లించనున్నారన్నారు. ఈ విజ్ఞాన యాత్ర విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన, ప్రకృతి పరిరక్షణ ప్రాముఖ్యతను టెక్నాలజీ అభివృద్ధి వంటి అంశాలపై సం పూర్ణమైన అవగాహన పెంపొందించేలా రూపొందిం చబడిందన్నారు. ఈనెల 21న ప్రారంభమై న ఈ యాత్ర, ఈనెల 23న విజయవంతంగా కొనసాగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈవో షేక్ సలీం భాష, ఉప విద్యాశాఖ అధికారులు జి సూర్య ప్రకా శం, సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు జిల్లా సైన్స్ అధికారి జి వి ఎస్ సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆదిత్య లో వినూత్నంగా విక్షిత్ భారత్ యూత్ పార్లమెంట్ - 2025

**గండేపల్లి , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**

గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ లో కాకినాడ,తూర్పు గోదావరి, కోనసీమ, అల్లూరి సీతారామ రాజు, యానాం జిల్లాల స్థాయి "వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025" ఎంతో వినూత్నంగా ప్రారంభమైంది. ఉభయ గోదావరి, యానాం జిల్లాల నోడల్ సంస్థ గా ఆదిత్య యూనివర్సిటీ ను కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఎంపికహొచేసిన సందర్భంగా ఈ కార్యక్రమం యూనివర్సిటీ డిప్యూటీ ప్రో. ఛాన్సలర్ డా. మేడపాటి శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విక్షిత్ భారత్ కేవలం కల కాదు, ఇది ఆర్థిక వృద్ధి, సాంకేతిక పురోగతి, సామాజిక సమానత్వం



పర్యావరణ స్థిరత్వం కోసం ఒక సామూహిక లక్ష్యం. ప్రతి పౌరుడు అత్యున్నతమైన జీవితాన్ని ఆనందించేలా నిర్ధారిస్తూ, ఆవిష్కరణలు, తయారీ, మౌలిక సదుపాయాలు డిజిటలైజేషన్లో భారతదేశాన్ని ప్రపంచ అగ్రగామిగా మార్చడమే లక్ష్యం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్.ఎం.బి. శ్రీనివాస్ మాట్లాడుతూ 2047 నాటికి మన భారత దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని యువత దానికి ముందు ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో కాకినాడ జిల్లా యూత్ ఆఫీసర్ కిషోర్ దూలం మాట్లాడుతూ యువకులు అందరూ ముందుకు వచ్చి అన్ని రంగాల్లో పాల్గొని, దేశాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జె.ఎన్.టి.యు.కె. కోఆర్డినేటర్ డా. జి.శ్యామ్ కుమార్ ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్. కో.ఆర్డినేటర్ పి. వెంకటేశ్వరావు, బి వి సి ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఈవిస్ శర్మ, డాక్టర్ తెలుగు నీలిమ లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సిలర్ రమా శ్రీ, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, డీన్ ప్రో. వి. సత్యనారాయణ, ఎన్.ఎస్.ఎస్ .అధికారులు బి. రాంబాబు, ఐ వి వీరాంజనేయులు పాల్గొన్నారు.

# వ్యాయామంతో రోగాలకు దూరంగా ఉండొచ్చు



**కాట్రేనికోన , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**
ఆరోగ్యమే మహా భాగ్యమని చెయ్యేరు సర్పంచ్ చెల్లి సురేష్ అన్నారు.పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు .ఈ సందర్భంగా అయన మాట్లడుతూ ఆరోగ్య సమాజ ఏర్పాటు కోసం సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం హర్షనీయమని సర్పంచ్ సురేష్ అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాయామం చేస్తే రోగాలకు దూరంగా ఉండవచ్చని సురేష్ పేర్కొన్నారు. ఆపద్బాంధవన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో సాయి విశ్వాస్ హాస్పిటల్ సౌజన్యంతో చేయ్యేర్రు గ్రామ పంచాయతీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సాయి విశ్వాస హాస్పిటల్ వైద్యులు గంధం విశ్వనాథం,హిమాని,సురేష్ రెడ్డి, ఆసద్ తదితరులు వైద్య సేవలు అందించి రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సుమారు 285 మందికి పరీక్షలు నిర్వహించామన్నారు.

ఈ కార్యక్రమం లో నాయకులు నడింపల్లి సుబ్బరాజు,మట్టా సూరిబాబు,గిడ్డి చంటి, ఆపద్బాంధన్ ఫౌండేషన్ ఎండి విప్పర్తి హరీష్, గ్రామ కార్యదర్శి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 22 నుంచి పామ్ పాంట్ పనులకు శ్రీకారం

**- జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేసేలా చర్యలు : కలెక్టర్ పి ప్రశాంతి**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**
"పామ్ పాంట్" (వ్యవసాయ చెరువులు) లని పంట సంజీవిగా తీర్చిదిద్దాలని, మార్చి 29 నుంచి గుంతలు లేని రహదారుల అభివృద్ధి పనులు పండుగా వాతావరణంలో వారోత్సవాల నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే. పవన్ కళ్యాణ్ సంకల్పం అనుసరించి జిల్లా స్థాయి లో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలియ చేశారు. శుక్రవారం అమరావతి నుంచి పల్లె పండుగ పనుల పురోగతిపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, డ్వామా పిడి ఎమ్. నాగమల్లేశ్వర రావు, ఎపిడి ఎస్. రామ్ ప్రసాద్, డి ఈ శ్రీరామకృష్ణ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, గుంతలు లేని రహదారుల అభివృద్ధి పనులు చేపట్టడం లో భాగంగా జిల్లాలో 662 పనులను ప్రతిపాదించి 118.72 కిలో మీటర్ల మేర సీసీ రహదారుల అభివృద్ధి నిర్మాణ పనులను ఉపాధిహామీ పథకం కింద చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా 120 కిలో మీటర్లు మేర రహదారులను లక్ష్యాలను మించి అభివృద్ధి పనులు పూర్తి చెయ్యడం జరిగిందని తెలిపారు.హా స్థానిక ప్రజా ప్రతినిధుల ప్రతిపాదించిన పనులని అనుసరించి, వొచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఉపాధిహామీ పథకంలో భాగంగా మరో 80 కిలో మీటర్ల మేర రహదారి అభివృద్ధి పనులను చేపట్టేందుకు తగిన ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.




మార్చి 22 వ తేదీన ఫామ్ పాంట్స్ పనులకు శ్రీకారం చుట్టడం పై ప్రత్యేక ప్రణాళిక అమలు చెయ్యాలని ఆదేశించారు. జిల్లాకు నిర్దేశించిన 1500 లక్ష్యాలను సాధించేందుకు యిప్పటి వరకూ 893 మేర (59. 53 శాతం ) యూనిట్స్ చెందిన పరిపాలన ఆమోదం కోసం మంజూరు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. మిగిలిన లక్ష్యాలను సాధించేందుకు క్షేత్ర స్థాయి అధికారులు తగిన ప్రతిపాదనలని అందచేయాలన్నారు. జూన్ నెలాఖరు నాటికి జిల్లాకి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక అందచెయ్యాలన్నారు. ఫామ్ పాంట్స్ పంట సంజీవులుగా అభివృద్ధి చెయ్యాల్సి ఉంటుందన్నారు. ఉపాధిహామీ పథకం పనులను సమర్ధవంతంగా చేపట్టడం ద్వారా జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రత్యేక గుర్తింపు పొందడం సాధ్యం అయిందన్న ఉప ముఖ్యమంత్రి వాక్యాలను స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టరు పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలు, నిబద్ధత కలిగిన పనితీరు తో కూడిన ఉపాధి హామీ పథకం పనులని క్షేత్ర స్థాయిలో ప్రతిపాదించేలా పనుల పురోగతి ఉండాలని కలక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారు.

# శివరాత్రికి నిరుత్సాహం..శ్రీరామ నవమికి ఉత్సాహం

**అంబాజీపేట , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**
కోనసీమ కొబ్బరి మార్కెట్లో గత నెల 26న జరిగిన మహాశివరాత్రి పర్వదినానికి కొబ్బరికాయ ధరలు అటు రైతుల్ని..ఇటు వ్యాపారులను నిరుత్సాహపర్చాయి. ఆ సమయంలో ఇతర రాష్ట్రాలకు కొబ్బరి కాయల ఎగుమతులు మందగించాయి. శివరాత్రికి ధరలు కూడా ఆశాజనకంగాలేవు.
అయితే ఏప్రిల్ 6న జరగబోయే శ్రీరామ నమమి పర్వదినానికి కోనసీమ పచ్చి కొబ్బరి కాయలకు మంచి డిమాండ్ వచ్చింది. దీంతో కోనసీమ కొబ్బరి మార్కెట్లో ఎగుమతులు ఊపందుకున్నాయి. ధర కుడా బాగానే ఉంది. రాష్ట్రంలో కొబ్బరికాయల దిగుబడి క్షీణించటం తో పాటు, అక్కడి కొబ్బరికాయల ధర ఎక్కువగా ఉండటంతో కోనసీమ కొబ్బరికాయలకు డిమాండ్ వచ్చింది.శ్రీరామనవమి పర్వదినాన్ని దేశవ్యాప్తంగా జరుపుకోవటంలో నీటి కొబ్బరికాయల వినియోగం పెరగటంతో ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడ వ్యాపా



రులకు పెద్ద మొత్తంలో ఆర్డర్లు వస్తున్నాయి. కోనసీమ నుంచి రోజుకు 70 నుంచి 90 లారీల పచ్చి కొబ్బరికారులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు జోరుగా సాగుతున్నాయి. శ్రీరామనవమికి దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాలకు ఎగుమతులు జరుగుతుండగా, తెలుగువారి తొలి పండుగ ఉగాదికి కోనసీమ నుండి ఏపీలోని పలు జిల్లాలకు పచ్చి కొబ్బరికాయలు ఎగుమతులు జరుగుతున్నాయి.

# నోరులేని జీవాలపై దుచ్చర్య..గుళికలుతిన్న రెండు ఆవుదూడలు



**అమలాపురం , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**
పంటకు నష్టం జరుగుతుందని నోరులేని జీవాలపై కక్షతో ఓ రైతు చేనుకు చుట్టూ విషాహారాన్ని పెట్టాడు. అభంశుభం తెలియక ఆ విషాహారాన్ని తిన్న రెండు ఆవు దూడలు ప్రాణాపాయ స్థితిలో కొట్టు మిట్టాడుతున్నాయి. ఎర్రవంతెన సమీపంలో తన పొలం చుట్టూ దాదాపుగా పలుచోట్ల విషపు గుళికలు కలిపిన తౌడును ఆహారం గా పెట్టాడు.అభంశుభం తెలియని రెండు ఆవుదూడలు తిన్నాయి.దీంతో అవి అపస్మారక స్థితిలో కొట్టు మిట్టాడు తుండగా అదే ప్రాంతానికి చెందిన రైతు చిన్నా గమనించి వాటికి ప్రాధమిక రక్షణ చర్యలు చేపట్టారు. అలాగే ఈ విషయాన్ని గౌతమ మహర్షి గో సంరక్షణ గోశాల నిర్వాహకులు పోతురాజు రామకృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు.వెంటనే రామకృష్ణ పశువైద్యులను సంప్రదించి సహాయక చర్యలు చేపట్టారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్ విజియారెడ్డి సిబ్బందితో వైద్యసేవలు అందించారు. గుళికలుతిన్న రెండు దూడలను గోశాల కార్యకర్తలు లింగోలు విస్సు,చిన్న సహకారాన్ని అందించారు.కాగా ఆవుదూడలు విషాహారం తిన్న ప్రాంతంలో పేపర్ ప్లేట్లలో పొలం చుట్టూ తవుడులో గుళికలు కలిపిన పేపరు ప్లేట్లు దాదాపుగా ఏభై వరకు వున్నాయని ఇటువంటి దుచ్చర్యకు పాల్పడ్డ రైతు పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

**- పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన్న రాజప్ప**
**- అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ**

**పెద్దాపురం , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**
రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తుందని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు, ప్రజలు అనారోగ్యాల పాలై ఆసుపత్రుల్లో లక్షలాది రూపాయలు పెట్టిన ఖర్చులకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ప్రజల ఆరోగ్య రక్షణకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. పెద్దలు



నియోజవర్గ పరిధిలోని సామర్లకోట మండలం అచ్చంపేట క్యాంప్ కార్యాలయంలో తెలుగుదేశం నాయకులు నిమ్మకాయల కిరణ్ కుమార్, ముత్యం రాజుబాబుల ఆధ్వర్యంలో అనారోగ్య బాధ్యత లబ్ధిదారులకు ఎమ్మెల్యే చినరాజప్ప చెక్కులను అందజేశారు. సహాయం అందుకున్న పలువురు లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

# ఎస్సీ వర్గీకరణ ఆపాలి



**రాజమహేంద్రవరం సిటీ , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**
ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కూటమి ప్రభుత్వం ఆపాలని ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. దళిత కులాల భేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాట సమితి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన శుక్రవారం తెలిపారు. కూటమి పరభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జిల్లా బిఎస్పీ అధ్యక్షుడు ఇసుకపట్ల రాంబాబు మాట్లాడుతూ ఆంధ్రా, తెలంగాణ ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వర్గీకరణ చేస్తున్నారన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. దీనిలో మర్రి బాబ్జి, పట్నాల విజయకుమార్, బద్దే జార్జి ఆంథోని, నక్కా వెంకటరత్నంరాజు, కోరుకొండ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షా కేంద్రం తనిఖీ



**గండేపల్లి , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**
పదవ తరగతి పరీక్షలు మూడవ రోజు మొత్తం 493 మంది విద్యార్థులకు గాను 486 మంది విద్యార్థులు హాజరై ఏడుగురు విద్యార్థులు హాజరు కాలేదు మూడవ రోజు పరీక్షలు మండలంలోని గండేపల్లి,మల్లేపల్లి, తాళ్లూరు మూడు కేంద్రాలలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్లేపల్లి పరీక్షా కేంద్రాన్ని మండల అభివృద్ధి అధికారి నాతి బుజ్జి, మండల విద్యాశాఖ అధికారి కే.హెచ్ నాయక్ సందర్శించారు.

# వర్గీకరణకు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు

**కాట్రేనికోన , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**
ఎస్. సి. వర్గీకరణ విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న ద్వంద్వ వైఖరి నిరసిస్తూ మండలంలో శుక్రవారం నుండి మాల మహానాడు నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు . రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేస్తున్న వర్గీకరణ చెల్లదని గతంలో సుప్రీంకోర్టు అనేకసార్లు చెప్పినప్పటికీ కేవలం ఓట్ల



రాజకీయం కోసం పార్టీలు పబ్బం గడుపుకోవడానికి వర్గీకరణ అనే అంశాన్ని తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. ఈ దీక్షల్లో నల్లా నరసింహమూర్తి, ఇసుకపట్ల రాంబాబు, వడ్డి శ్యామ్ ప్రసాద్, అయితాబత్తుల శ్రీనుబాబు,గెల్లా రాజేంద్ర , వాకపల్లి భీమరావు, బడుగు భీమేష్,వడ్డి అంబేద్కర్, నందిక క్రాంతి కుమార్, అయితాబత్తుల బాబ్జి, బండి మరిడెశ్, పోలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు సమతుల్య ఆహారాన్ని అందించాలి : సెక్టర్ సూపర్వైజర్ అరుణ



**శంకవరం , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**
చిన్ననాటి నుండే పిల్లలకు పోషక విలువలు గల సమతుల్య ఆహారం అందించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దవచ్చని శంకవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్ అరుణ శ్రీ పేర్కొన్నారు మండల కేంద్రమైన శంకవరంలో గల విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల భాగంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రులు ప్రధాన పాత్ర పోషించాలని, సమాజం కూడా పిల్లలు ఎదుగుదలకు అవసరమైన పోషక విలువలను తెలియజేయాలన్నారు. బాల్యం మొదటి మూడు సంవత్సరాలు అభివృద్ధిలో కీలకమని ఈ దశలో మానసిక వికాసం వేగంగా జరుగుతుందని కనుక పిల్లలకు సురక్షితమైన పోషకాహారంతో కూడిన ప్రేమతో కూడిన వాతావరణాన్ని అందించడం అంతేనా అవసరమన్నారు. పిల్లల ప్రాథమిక అభివృద్ధికి మెరుగైన పునాది వేశాల ఎంతగానో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు సామాజిక నైపుణ్యాలను బోధించి ప్రత్యేక విద్యా విధానం అనుసరించాలని పిల్లల సులభంగా నేర్చుకునేలా బోధన పద్ధతులు ఏ విధంగా ఉండాలో శిక్షణలో నేర్పడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రజిని అంగన్వాడి వర్కర్లు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

# జనసేన పార్టీ లో చేరినఆరుగురు వైసిపి ఎంపీటీసీలు

**కాకినాడ రూరల్ , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**
జనసేన పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై కాకినాడ రూరల్ మండలానికి చెందిన ఆరుగురు వైసిపి ఎంపీటీసీలు శుక్రవారం తెనాలి జనసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. వారందరికీ నాదెండ్ల జనసేన కండువాలు వేసి సాదారంగా పార్టీలోకి ఆహ్వానించారు. వాసంశెట్టి సత్యవతి, కేతా సూర్యచంద్ర, గుత్తుల శ్రీను, మామిడాల నాగచక్రం, బందిలి వీరిషా, గుత్తుల సత్తిబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వానికి ,కూటమి ప్రభుత్వం చేస్తున్న



అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరామని వారు తెలిపారు. జనసేన పార్టీ నాయకులు సిరంగు శ్రీనివాస్, మాదారపు తాతాజీ, పుల్ల శ్రీరాములు, జీని శ్రీనివాసు, దాసరి శివ , నందిపాటి త్రిమూర్తులు,బిజెపి నాయకులు గీసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఇక్కడ ఈ నెల 27న ఎంపీపీ ఎన్నిక జరగనుంది. ఈ చేరికలతో ఎంపీపీ పీఠాన్ని జనసేన కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పిఠాపురం 'ఆర్టీసీ 'కాంప్లెక్స్ లో 'కంప్లైంట్స్ '

**పిఠాపురం , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**
అన్నం ఉడికిందో..?, లేదో..?, తెలుసుకోవడం కోసం, ఒక్క మెతుకు పట్టుకుని చూస్తే తెలిసిపోతుంది.అలాగే ఒక ఊరు స్థితిగతులు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలంటే, అక్కడ ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్వహణ తీరు చూస్తే చక్కగా అర్థమవుతుంది.నిత్యం ఆ ఊరు మీదగా బస్సులలో ప్రయాణించే ప్రయాణికులు, ఆర్టీసీ కాంప్లెక్స్ యొక్క స్థితిగతులను చూసి, ఆ ఊరి అభివృద్ధిని అంచనా వేస్తారు.ఇక అసలు విషయానికి వస్తే...

పిఠాపురం పట్టణంలోని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్వహణ తీరుపై సర్వత్ర విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి.కాంప్లెక్స్ లోకి వెళ్ళిన ప్రతి ప్రయాణికుడు ముందుగా అక్కడ చూసేది టాయిలెట్స్, త్రాగునీరు సౌకర్యం.ఆ రెండు సౌకర్యాలకు సంబంధించి, ఎప్పటికప్పుడు అక్కడ పరిశుభ్రత ఉండేలా చూసుకోవాలి.కానీ స్థానిక కాంప్లెక్స్ లో వాటి నిర్వహణ, అంతంత మాత్రంగానే ఉంది.టాయిలెట్స్ యొక్క ప్లంబింగ్ విభాగ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో ప్రయాణికులు,చెప్పుకోలేని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అక్కడ పరిశుభ్రత కూడా, తూతూ మంత్రంగా చేస్తున్నారనే ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి.

టాయిలెట్స్ నుండి సెప్టిక్ ట్యాంక్ కు వెళ్ళే పైప్ మార్గంలో ఉన్న మినీ మ్యాన్ హోల్ ఒకటి మరమ్మతుకు గురికావడం వల్ల, టాయిలెట్స్ నుండి వచ్చే మురుగు నీరు అంతా.. ఆ పరిసరాల్లో తిష్ట వేసి, దుర్గంధం వెదజల్లుతుంది.బస్సులు



బయటకు వెళ్ళే మార్గం పక్కనే, ఆ మినీ మ్యాన్ హోల్ ఉండడం వల్ల బస్సులలో వెళ్ళే వారితో పాటుగా, అక్కడ చుట్టుపక్కల నివాసం ఉండే వారికి కూడా చాలా ఇబ్బందికరంగా మారింది.

ఆర్టీసీ కాంప్లెక్స్ లో పారిశుధ్య నిర్వహణ పరిస్థితి ఈ విధంగా ఉంటే, ఇక కాంప్లెక్స్ అభివృద్ధి ఏ విధంగా జరుగుతుందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు.అలాగే కాంప్లెక్స్ వెనుక భాగంలో ఉండే చిన్న గేటు మార్గంలో మున్సిపాలిటీ వారి డస్ట్ బిన్ అక్కడ అడ్డంగా ఉండడంతో అటుగా వచ్చే ప్రయాణికులు,విద్యార్థులు చెత్తను దాటుకుని, కాంప్లెక్సులోకి వెళ్ళాల్సి వస్తుంది.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి, ఆర్టీసీ కాంప్లెక్స్ లోని టాయిలెట్స్ రూపు రేఖలను మార్చాలని, ఆ పరిసరాల్లో దుర్గంధపు వాసనలను తరిమికొట్టాలని , పలువురు కోరుకుంటున్నారు.

# బి.బి.పట్నంలో ఉపాధి మస్తర్లను పరిశీలించిన ప్రోగ్రాం కోఆర్డినేటర్



**రౌతులపూడి , మార్చి 21 ( ప్రభాతవార్త ) :**
మండలంలోనిబి. బి.పట్నం దొర చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనిని శుక్రవారం ప్రోగ్రాం కోఆర్డినేటర్ వి.వి.కిరణ్ తనిఖీ చేశారు. వేతన దారుల మస్తరు సీటును పరిశీలించారు. వేతనదారుల హాజరును అడిగి తెలుసుకున్నారు. గురువారంనాడు 204 మంది హాజరైతే, శుక్రవారం145మంది మాత్రమే హాజరవడం ఏమిటని ఆయన అక్కడ ఉన్న మేట్లను ప్రశ్నించారు. ఈ వ్యత్యాసం ఏమిటన్నారు. పనిలోకి రాని వేతనదారులకు మస్తర్లు వేస్తే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరంఏ. పి. ఓ కార్యాలయం నందు ఏపీఓ, టి ఏ, సి. ఓ లతో సమావేశం నిర్వహించారు. ప్రతిరోజు ఉపాధి పనులను తనిఖీ చేయాలని ఆయన సూచించారు. ఉపాధి పనుల్లో అవకతవకలకు చోటు ఇవ్వరాదన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

